క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

జీవీఎంసీ హైస్కూల్‌కు జిమ్ పరికరాల బహూకరణ



ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి ప్రతినిధులు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌కు ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్ బహూకరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు టి.సత్యశ్రీ లక్ష్మీదేవి, కార్యదర్శి ఎం.హర్ష, కోశాధికారి ఎంవీవీ అశోక్, చైర్‌పర్సన్ ఆఫ్ ఉమెన్ ఎక్విప్‌మెంట్ పిల్లి రమణ చేతుల మీదుగా శుక్రవారం జిమ్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయంతి రాధా కుమారి మాట్లాడుతూ పిల్లల వ్యాయామానికి జిమ్ పరికరాలు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, వ్యాయామ ఉపాధ్యాయులు రత్నం, జ్యోతి, పేరెంట్ కమిటీ చైర్మన్ వంగల అప్పలరాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీ



పోటీ విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీ నిర్వహించారు. పౌర గ్రంథాలయం సొసైటీ నిర్వహించిన ఈ పోటీలకు గ్రంథాలయ సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. వర్తమాన అంశాలు, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర, రాజ్యాంగం, విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు, భౌగోళ శాస్త్రంపై క్విజ్ పోటీ జరిగింది. 50 మంది విద్యార్థులు ఆరు బృందాలుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరు రౌండ్లలో జరిగిన పోటీలో గెలుపొందిన వారికి పుస్తకాలు బహూకరించారు. ప్రధాన గ్రంథపాలకురాలు దుర్గారాణి, రామలక్ష్మి పర్యవేక్షించారు.

సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏయూ నార్త్ క్యాంపస్‌లోని అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహాల ప్రాంగణంలో విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏయూ హార్టీ కల్చరల్ గార్డెనింగ్ విభాగం ప్రత్యేకంగా వివిధ పండ్ల జాతులు, దీర్ఘకాలం జీవించే మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా చుట్టూ రక్షణ కంచె సైతం ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు అందించిన వీసీటీపీఎల్ అధికారులను ఏయూ వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో వీసీటీపీఎల్ టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీ, వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్–అడ్మిన్) ఎం.ఎస్.రావు, పీఆర్–సెక్యూరిటీ విభాగం సీనియర్ జనరల్ మేనేజర్ జిత, ఆపరేషన్ విభాగం హెడ్ మధు, రిక్రూట్‌మెంట్ హెడ్ కుమార్, ఏయూ హార్టీ కల్చరల్ విభాగం డీన్ ఆచార్య ఎస్.బి. పడాల్, అకడమిక్ డీన్ ఆచార్య శ్రీనివాసరావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సంధ్యా దీపిక, అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య యుగంధర్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ మెచ్చే రైతుబజార్



రైతుబజార్‌లో వినియోగదారుల రద్దీ



స్టాళ్లు సరిపోక ఆరుబయట కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

- సీతమ్మధార రైతుబజార్‌కు వినియోగదారుల ఆదరణ
- అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లు లభ్యం
- వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చి, విక్రయిస్తున్న రైతులు
- ఐఎస్‌వో ఏ గ్రేడ్ సర్టిఫికెట్‌తో గుర్తింపు



రైతుబజార్ పొందిన ఐఎస్‌వో సర్టిఫికెట్



సీతమ్మధార రైతుబజార్

తాటిచెట్లపాలెం: నగరం నడిబొడ్డున గల సీతమ్మధార రైతుబజార్ అత్యంత ప్రజాదరణ పొందింది. నిత్యం వినియోగదారులతో కళకళలాడుతోంది. వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి రోజు వందలాది మంది రైతులు తమ పంట పొలాల్లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. నగరంలోని అత్యంత రద్దీగా ఉండే రైతుబజార్లో ఇదీ ఒకటి. ఈ రైతుబజార్ నాణ్యతా ప్రమాణాలకు గుర్తింపు గానూ 2021 జూలై 13న ఐఎస్‌వో 9001 : 2015లో ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సైతం అందజేశారు. ఈ సర్టిఫికెట్ పొందిన మొదటిది ఎంవీపీ కాలనీ రైతుబజార్ కాగా.. రెండోది ఇదే.

152 స్టాళ్లు.. 317 మంది వ్యాపారులు

సీతమ్మధార రైతుబజార్‌లో మొత్తం 152 స్టాళ్లు ఉండగా.. ఉదయం, సాయంత్రం వేళల్లో కలిపి మొత్తం 317 మంది రైతులు, డ్వాక్రా గ్రూప్ సంఘాల సభ్యులు కూరగాయలు, పండ్లు, పూలు, ఆకుకూరలు విక్రయిస్తుంటారు. ఇక్కడికి స్థానికులతోపాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి సగటున ప్రతి రోజూ సుమారు 6 వేల మంది కంటే ఎక్కువగా వినియోగదారులు వచ్చి వెళ్తుంటారు. ఈ రైతుబజార్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. పండగ సీజన్‌లో జనంతో మరింత సందడిగా మారుతుంది.

నిత్యం అందుబాటులో..

ఈ రైతుబజార్‌లో అన్ని రకాల సీజనల్ పండ్లు, కూరగాయలతోపాటు నిత్యం అందుబాటులో కూరగాయలు, ఆకుకూరలను రైతులు ఇక్కడికి తీసుకొస్తుంటారు. మామిడి పండ్ల సీజన్‌లో ప్రసిద్ధి చెందిన కొత్తపలి కొబ్బరి, ఇమందు పసందు, పండూరి, బంగినపల్లి, పరియాలు, పణుకులు, పెద్దరసాలు వంటి పండ్లను తీడ, ఎల్.కొత్తూరు, ఆర్లి వంటి గ్రామాల్లో రైతులు పండించి ఈ రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తారు. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ నుంచి ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, టమాటా, క్యారెట్, బీట్రూట్, క్యాప్సికం వంటి కూరగాయలతోపాటు సమీప గ్రామాల నుంచి దొండకాయలు, బెండకాయలు, బీరకాయలను రైతులు తీసుకొస్తుంటారు. ఆనందపురం, కోటపాడు, సబ్బవరం మండలాల నుంచి కూడా అధికంగా ఇక్కడికి రైతులు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వీరితోపాటు చింతల అగ్రహారం, పెందుర్తి మండలాల నుంచి రైతులు ప్రతి రోజూ తాజా ఆకుకూరలు, పూలు తీసుకువచ్చి జీవనోపాధి పొందుతున్నారు.

చిన్న చిన్న సమస్యలు

సీతమ్మధారలో రైతుబజార్‌ను ప్రారంభించిన నాటి నుంచి సమీప ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయి. బజార్‌లో వసతులు మాత్రం పెరగలేదు. స్థలా భావం వల్ల స్టాళ్ల సంఖ్య పెంచలేదు. దీంతో పలువురు రైతులు చిన్నపాటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. రైతుబజార్ బయట నేలపై కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇక్కడ మరో ప్రధాన సమస్య పార్కింగ్. నిత్యం రైతుబజార్‌కు వచ్చే వినియోగదారుల వాహనాలతో సీతమ్మధార మెయిన్ రోడ్డులో పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. ఆదివారాలు, సెలవు రోజుల్లో ఎక్కువ మంది వినియోగదారులు రావడం వల్ల ఈ సమస్య మరింత జటిలమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రైతుబజార్‌లో అదనపు స్టాళ్లు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు, స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరుబాట



సీఎండీ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాటిచెట్లపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం గురుద్వారాలోని విద్యుత్ సౌధ కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2లకు పాత సర్వీస్ రూల్స్ ప్రకారం ఏఎల్ఎం ప్రమోషన్లు ఇవ్వాలని, నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి అందజేసినట్లు తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఆందోళనలు చేస్తామని, ఈ నెల 21న చలో విజయవాడ విద్యుత్ సౌధ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ కాకినాడ అధ్యక్షుడు శంకరరావు, కార్యదర్శులు వెంకన్నబాబు, సూర్యనారాయణ, మల్లేశ్వరరావు, భాస్కర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ నుంచి శివరామకృష్ణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ గర్భిణులకు పోషకాహార ప్రణాళిక గురించి తెలియజేయాలన్నారు. నిర్దేశించిన సమయంలో వ్యాక్సినేషన్ చేయించాలని ఆదేశించారు. జిల్లా మీడియా విస్తరణాధికారి(డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ టీనేజీలో గర్భం దాల్చకుండా చూసుకోవాలని, వివాహ వయస్సు 20 ఏళ్లు దాటితే మంచిదన్నారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి బి.విజయలక్ష్మి, జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, వైద్య ఆరోగ్య శాఖ పలు విభాగాల ప్రాజెక్టు అధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ ఎస్.వి.సమత, శశిభూషణ్, మలేరియా నివారణ, టీబీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

పొగాకు నిర్మూలనకు సంతకాల సేకరణ



పొగాకు నిర్మూలన కోరుతూ సంతకం చేస్తున్న డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: పొగాకు నిర్మూలనకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సంతకం చేశారు. పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, వ్యసనాల దుష్పరిణామాలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగి పొగాకు నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోల్‌ఫీల్డ్స్ అధికారులకు ఐఐఎంవీలో ముగిసిన శిక్షణ



మహానది కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం విశాఖపట్నం (ఐఐఎంవీ)లో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన 21 మంది అధికారులకు నిర్వహించిన అభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక వాతావరణంలో అనుకూల నాయకత్వం ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వ రంగంలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నాయకులను తీర్చిదిద్దేందుకు ఐఐఎంవీ చేస్తున్న కృషిని అభినందించారు. నిర్వహణ సామర్థ్యాలను, నాయకత్వ ప్రభావాన్ని బలోపేతం చేయడమే ఐఐఎంవీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ శిక్షణలో నెగోషియేటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, కార్పొరేట్ ఫైనాన్స్, జెండర్ సెన్సిటైజేషన్, నాయకత్వ దృక్పథాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం డైరెక్టర్లు ప్రొఫెసర్లు ఎంవీ అనురాధ, బిషాఖా మంజుదార్ తదితరులు పాల్గొన్నారు.

యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు



మాట్లాడుతున్న నగేష్, లక్ష్మీప్రసాద్

సీతంపేట: యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింహాచలం గిరి ప్రదక్షిణలో 50 వేల మంది భక్తులకు సేవలందించడం మహాభాగ్యమని సంస్థ ప్రతినిధులు వంశీ, లక్ష్మీప్రసాద్, నగేష్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యూనిటీ ఫౌండేషన్, ప్రైమావల్ టెక్నాలజీస్, ఆక్సల్ ఎస్టెటిక్స్ సంయుక్తంగా గిరి ప్రదక్షిణలో భక్తులకు బిస్కెట్లు, ఓఆర్ఎస్, మందులు, ప్రసాదం, మంచినీరు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వీరూమామాస్ బ్రాండ్ భాగస్వామ్యం కావడం చాలా సంతోషమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్‌లో మరెన్నో చేయాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కృష్ణప్రసాద్ బెహ్రా, శ్రీ పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరు మృతి



అశోక్ రెడ్డి(ఫైల్)

గోపాలపట్నం: షీలానగర్ నుంచి పోర్టుకు వెళ్లే దారిలో మారుతీ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు వెల్లడించిన వివరాలివి. పరవాడ మండలం గొర్లెవానిపాలేనికి చెందిన ముచల అశోక్ రెడ్డి (45) ద్విచక్రవాహనంపై విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా, మారుతీ జంక్షన్ వద్ద వెనుకనే వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అశోక్ అదుపుతప్పి లారీ ముందు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతను జేడీ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అశోక్‌కు భార్య లలిత, కుమార్తె హస్వినిత, కుమారుడు వహినాథ్ రెడ్డి ఉన్నారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు.

యువతరమే దేశ భవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

విశాఖ సిటీ: భారతీయ యువత దేశ భవితగా నిలుస్తారని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. యువతరం విలువైన మానవ వనరులుగా నిలవాలని సూచించారు. కళాశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో అన్వయిస్తూ సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపాలని పిలుపునిచ్చారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ దేశ జనాభాను ముఖ్యంగా యువతను సమాజానికి ఉపయుక్తంగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకతను వివరించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్య, వైద్యం, మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన ప్రాధాన్యాన్ని తెలియజేశారు. తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు అన్నవరపు చంద్రమోహన్ జనాభా వృద్ధి, పర్యవసానాలు, పరిష్కారాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి, డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు అభినందనీయం



బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డులో ప్రజలకు ఎన్నో సేవలందించి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న 27 మంది సచివాలయ సిబ్బందిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. వార్డులో శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించిన సచివాలయ సిబ్బంది బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందన్నారు. కరోనా కష్టకాలంలో సిబ్బంది ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్.అప్పారావు, బి.గోవిందరాజు, కె.చిన్నా, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యం మురుగుమయం

- సీతంపేట ప్రధాన రహదారిలో యూజీడీ లీకేజీ
- అవస్థలు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు



భాష్యం స్కూల్ వద్ద లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్



సీతంపేట మెయిన్ రోడ్డులో శ్రీవిశ్వ కళాశాల వద్ద నిలిచిన మురుగునీరు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మెయిన్ రోడ్‌లో మురుగు నీరు ప్రవహించడంతో స్థానికులు, పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి అపూర్వ హాస్పిటల్ రోడ్‌లోని భాష్యం స్కూల్ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవడంతో మురుగంతా రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. శ్రీవిశ్వ కళాశాల వద్ద మురుగు నీరు నిలిచిపోతోంది. కొన్ని రోజులుగా ఈ మార్గంలో ఇదే పరిస్థితి నెలకొందని, ఫిర్యాదు చేస్తే సిబ్బంది వచ్చి ప్రయత్నిస్తున్నా.. సమస్య మాత్రం పరిష్కారం కాలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మీద మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని వాపోతున్నారు. కళాశాలలు, స్కూళ్లు, ఆస్పత్రికి వచ్చే వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో 18 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రైల్వే పోలీసులు నిర్వహించిన వేర్వేరు తనిఖీల్లో మొత్తం 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ జూలి కర్మాకర్ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన షేక్ ముజాహిద్ హుస్సేన్ కోరాపుట్ నుంచి విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి రూ.40 వేల విలువైన 8 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

మరో కేసులో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారం, ఆర్పీఎఫ్ ఎస్ఐ పుష్పరాణి బిషోయి తమ సిబ్బందితో రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఒడిషా గంజాం జిల్లాకు చెందిన పంచానన్ సాహూ విశాఖ మీదుగా సూరత్‌కు గంజాయి తరలించడాన్ని గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, రూ.50 వేల విలువైన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం



సమావేశంలో పాల్గొన్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి తెలిపారు. మురళీనగర్‌లోని గంగా గోదావరి అపార్ట్‌మెంట్ వద్ద శుక్రవారం నిర్వహించిన క్లబ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మాడుగుల, కొత్తపాలెం తదితర మారుమూల గిరిజన ప్రాంతాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ప్లాంక్స్, పంపిణీ చేయాలని సభ్యులంతా నిర్ణయించామన్నారు. ఆదివారం నిర్వహించనున్న డిస్ట్రిక్ట్–101 మూడో క్యాబినెట్ సమావేశంలో మాధవధార మహిళా వాకర్స్ సభ్యులందరూ పాల్గొనాలని ఆమె కోరారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు రోజూ క్రమం తప్పకుండా అరగంట సేపు నడవాలని యోగా గురువు ఎం.శేషామణి సూచించారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి పి.కమల, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరిశోధనల నాణ్యతలో రాజీ వద్దు



శతాబ్ది వాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

విశాఖ సిటీ: పరిశోధనల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అకడమిక్ సెనేట్ మందిరంలో ప్రారంభమైన 'శతాబ్ది వాణి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశోధనల్లో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశోధకులు స్వీయ ప్రేరణతో ముందుకు సాగాలని అన్నారు. పరిశోధన గ్రంథ రచనను సరళంగా, సులభంగా, ఆసక్తిదాయకంగా ఎలా చేయాలో వివరించారు. డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాల నిపుణులను విశ్వవిద్యాలయానికి ఆహ్వానిస్తున్నామని, దీని ద్వారా విద్యా సంబంధిత వాతావరణం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ నెల 17న రెండో 'శతాబ్ది వాణి' ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజాశంకర్, ఆచార్య పద్మశ్రీ, ఆచార్య సీతామాణిక్యం, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆనందగజపతిరాజు, బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్ డాక్టర్ సాల్మన్ బెన్నీ సహా పలువురు విభాగాధిపతులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో జనాభా దినోత్సవం

మద్దిలపాలెం: విద్యావంతులు, ఆరోగ్యవంతులైన జనాభా దేశాభ్యున్నతికి దోహదపడుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు అన్నారు. శుక్రవారం కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. జయ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రాజేశ్వరరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. రవిబాబు తదితరులు పాల్గొన్నారు.